క్లుప్తంగా

ప్రైవేటు టీచర్లకు హెల్త్‌కార్డులు



హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేటు పాఠశాలల టీచర్లకు హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. ఆదివారం ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాయలసీమ రీజియన్ అధ్యక్షులు దండె దస్తగిరి ఆధ్వర్యంలో సెవెన్ హిల్స్ ఆసుపత్రి సౌజన్యంతో హెల్త్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 50శాతం రాయితీతో 300మంది ఉపాధ్యాయులకు కార్డులు అందజేశామని చెప్పారు.

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు చేసి, హారతులు పట్టారు. పలువురు మహిళలు అమ్మవారికి పండ్లు, చీర, పిండవంటలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఘనంగా హోలీ వేడుకలు



ఎం.తండాలో రంగులు చల్లుకుని చిన్నారుల సంబరాలు

చాగలమర్రి: మండలంలోని ఎం.తండా, ఓజీ.ండా, కేపీతండాలో ఆదివారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పండుగను రెండు రోజుల పాటు నిర్వహిస్తారని ముత్యాలపాడు సర్పంచ్ శంకరమ్మబాయి తెలిపారు. ఆదివారం ఉదయం నుంచే చిన్నా,పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులు గ్రామ వీధుల్లో జాజిరి పాటలు పాడుతూ, ఆటలు ఆడారు. తండాల్లోని వీధులన్నీ రంగుల మయమయ్యాయి. రెండవ రోజు సోమవారం తమ ఇలవేల్పు అయిన సేవాలాల్ మహారాజ్, మరెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ.

30న నంద్యాలలో రన్‌ఫర్ జీసెస్

నంద్యాల(న్యూటౌన్): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాలలో ఈనెల 30వ తేదీన రన్‌ఫర్ జీసెస్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రవీంద్రపాల్ తెలిపారు. ఆదివారం కార్యక్రమానికి కరపత్రాలను క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ఆవిష్కరించారు. క్రిస్టియన్ వెల్ఫేర్ అండర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు కె.జోసెఫ్, పాస్టర్ అన్నాస్, అందం సుధాకర్, ఏసుదాసు, ప్రెసిడెంట్ రవికుమార్, సెక్రటరీ జాషువా మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ఏటా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1(పెద్దచర్చి) ఆలయం నుంచి ఉదయం 6గంటలకు నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ ఐజక్ వరప్రసాద్ ప్రారంభిస్తారని చెప్పారు. సంజీవనగర్ గేట్, శ్రీనివాససెంటర్, సాయిబాబానగర్, ఆర్ఎస్ రోడ్డు మీదుగా పెద్దచర్చి చేరుకుంటుందన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

రుద్రవరం: మండల కేంద్రానికి చెందిన పావని (28) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 22న భర్తతో కలిసి మహానందికి వెళ్తుండగా చిన్నకంబలూరు మెట్ట సమీపంలో ప్రమాద వశాత్తు మోటర్ సైకిల్ మీద నుంచి కిందపడింది. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలకోలేక ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ వివరించారు. మృతురాలికి భర్త, ముగ్గురు సంతానం ఉన్నారు.

మహానందిలో సండే సందడి



కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది: సెలవురోజు కావడంతో మహానంది ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం జరిగిన అష్టవిధ మహామంగళహారతుల సమయంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు సందడి కొనసాగింది.

ఓంకారంలో భక్తుల సందడి

బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవార్లకు అష్టవిధ మహామంగళ హారతులు, అభిషేకం పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక కాశిరెడ్డినాయన అన్నపూర్ణ ఆశ్రమంలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

శాస్త్రోక్తంగా తొట్టి తిరుమంజనం

- కొనసాగుతున్న అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు
- ఉదయం కాలింగనర్ధనోత్సవంలో దర్శనమిచ్చిన ఉత్సవమూర్తులు
- రాత్రి అశ్వవాహనంపై ఊరేగిన ప్రహ్లాదవరదుడు
- నవనారసింహ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు



ఉభయ దేవేరులతో తొట్టి తిరుమంజనం సేవకు సిద్ధమైన ప్రహ్లాదవరదుడు



కాలింగనర్ధనోత్సవంలో ప్రహ్లాదవరదుడు



తొట్టి తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: అహోబిలంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకలు చివరిదశకు చేరుకోవడంతో ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, ఉత్సవాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం దిగువ అహోబిలంలో కాళింగనర్ధనోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులు గావించి గ్రామోత్సవం చేపట్టారు. రాత్రి ప్రహ్లాదవరదస్వామి మహారాజు అలంకరణలో అశ్వవాహనం అధిష్ఠించి మాడవీధుల్లో సంచరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. అలాగే.. ప్రహ్లాదవదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు తొట్టి తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి పూజల అనంతరం పండితుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య పన్నీరుతో నింపిన వెండి తొట్టిలో సప్త నదులను ఆవాహం చేసి ఉత్సవ మూర్తుల పాదాలను ముంచి అభిషేకించారు.కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

మార్కెట్ యార్డుల్లో ఎన్నికల కోడ్

నంద్యాల(సెంట్రల్): ఎన్నికల కోడ్ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా మార్కెట్ యార్డుల ఆవరణలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, సమావేశాల నిర్వహణ నిషిద్ధమని జిల్లా అగ్రి ట్రేడింగ్ అండ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రెహమాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా అతిక్రమిస్తే శిక్షార్హులని పేర్కొన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, నిబంధనల ప్రకారం వ్యవహరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల(అర్బన్): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం నంద్యాల జిల్లా నూతన అధ్యక్షుడు నాగేంద్రప్ప తెలిపారు. సమస్యలను పరిష్కరించి నంద్యాల జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తామన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న విజయవాడలోని రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవ తీర్మాణం ద్వారా తనను నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించారని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, తిరుపాలయ్య, సునీల్ కుమార్, పట్టణ అధ్యక్షులు సత్యం, శ్రీహరి, ప్రభావతమ్మ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

నంద్యాల: ఈనెల 28వ తేదీన నంద్యాలలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభను విజవంతం చేయాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, నంద్యాల ఎంపీపీ శెట్టి ప్రభాకర్, గోస్పాడు ఎంపీపీ అర్థర్‌సైమన్, పాంషావలి, మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, నాయకులు ప్రహ్లాదరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్లు శశికళారెడ్డి, సునీత అమృతరాజ్, చంద్రశేఖర్, కలాం హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నాయకుడు జగనన్నను సీఎంగా గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. నిజాయితీతో పార్టీ అభివృద్ధికి కృషి చేసే నాయకులకు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో భవిష్యత్ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో గ్రామ/వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్లు, ఇంటింటికీ కుళాయి, సీసీ రోడ్లు, డ్రైన్లు, తదితర సౌకర్యాలు కల్పించామని చెప్పారు. ఇన్ని అభివృద్ధి పనులతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశారని, దాదాపు ప్రతి ఇంటికీ పథకాలు వర్తించాయని చెప్పారు. ఇన్ని మంచి పనులు చేసిన వైఎస్ జగన్‌ను గెలిపించుకోవసిన బాధ్యత మనతో పాటు ప్రజలందరిపై ఉందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇడుపులపాయ నుంచి ప్రారంభించనున్న మేమంతా సిద్ధం సభ ఈనెల 28న నంద్యాల చేరుకుంటుందని, మనమంతా కలిసికట్టుగా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల పట్టణ క్లస్టర్ అధ్యక్షులు పున్నా శేషయ్య, పడకండ్ల సుబ్రహ్మణ్యం, జాకీర్ హుసేన్, నంద్యాల టౌన్ జేసీఎస్ కన్వీనర్లు సలాముల్లా, సాయిరాంరెడ్డి, అమీర్, కుమ్మరి రాముడు, నంద్యాల మండల జేసీఎస్ కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, గోస్పాడు మండల జేసీఎస్ కన్వీనర్ జనార్ధన్ రెడ్డి, డాక్టర్ రాకేష్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ శంకరానాయక్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కారు రవికుమార్, జాయింట్ సెక్రటరీ, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయిట్ సెక్రటరీ గౌస్పీర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నంద్యాల, గోస్పాడు మండలాల్లోని గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే శిల్పా రవి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు

నంద్యాల: పట్టణంలోని దేవనగర్, శ్యామ్‌నగర్, వీసీ కాలనీ ప్రాంతాల్లోని టీడీపీకి చెందిన యువకులు భాస్కర్, రమణయ్య, కంటయ్య, శీను, దుర్గ, రవి, వెంకటేశ్వర్లు, పెద్ద దుర్గా, విజయ్, రమేష్, మాలిబాషా ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి సమక్షంలో 27వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దేవనగర్ బాషా, మేస చంద్రశేఖర్, భాస్కర్, కంటయ్య, అధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి యువత తమ శక్తి సామర్థ్యాలను నియోగించాలని పిలుపునిచ్చారు. ఈనెల 28వ తేదీన నంద్యాలలో నిర్వహించనున్న సిద్ధం సభను దిగ్విజయం చేయాలని కోరారు. శ్యామ్‌నగర్, దేవనగర్, వీసీ కాలనీల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయికులు, కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీలో చేరిక

రుద్రవరం: స్థానిక బెస్త కాలనీకి చెందిన జనసేన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అన్నలదాసు నరసింహారావు(బాబు), మాజీ సర్పంచు అన్నల దాసు నర్సమ్మ, ప్రసాదు, హర్ష, నారాయణ, ఓబులేసు, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, చిన్నవుశేని, పెద్ద బంగారు, చిన్నగుండన్న, బండారు లాలుస్వామి, గొడుగు చిన్నతో పాటు మరికొన్ని కుటుంబాలు ఆదివారం జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. అన్నలదాసు బాలన్న, బోయలకుంట్ల చిన్న నాగన్న, డిష్ భాస్కర్ ఉన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి





సాంబవరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కానాలపల్లెలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గోస్పాడు: రాబోయే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని యాళ్లూరు, సాంబవరం, దీబగుంట్ల, కానాలపల్లె, గోస్పాడు, జిల్లెల్ల గ్రామాల్లో ఆదివారం కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఎవరైనా గొడవలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పెద్దకొట్టాలలో 15 పొట్టేళ్ల మృతి



నరసింహులును ఓదారుస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి



మృతి చెందిన పొట్టేళ్లు

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో ఆదివారం 15 పొట్టేళ్లు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. గ్రామానికి చెందిన నరసింహులుకు చెందిన పొట్టేళ్లు మృత్యువాత పడిన విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు శివనాగిరెడ్డి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి విషయం చేరవేశారు. ఆయన గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబానికి ఓదార్చారు. తాము అండగా ఉంటామని ప్రభుత్వం నుంచి సాయం త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. గుర్తుతెలియని వ్యక్తులు విషప్రయోగం చేసి ఉంటారనే అనుమానంతో పశువైద్యాధికారులు వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి పొట్టేళ్లకు పంచనామ నిర్వహించి నమూనాలను హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపారు. నివేదికలు వచ్చిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని వైద్యాధికారులు తెలిపారు.

సగరులు అన్ని రంగాల్లో రాణించాలి

నంద్యాల టౌన్: సగరరులు తాము ఎన్నుకున్న రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని నంద్యాల అసెంబ్లీ సగర సంఘం గౌరవ అధ్యక్షుడు టివై శివ అన్నారు. ఆదివారం స్థానిక భరతమాత గుడి ప్రాంగణంలో నంద్యాల అసెంబ్లీ సగర సంక్షేమ సంఘం నూతన కమిటీని జిల్లా సెక్రెటరీ ఉప్పరి సురేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాల పరిమితికి నూతన కమిటీని ఎన్నుకొనున్నామని, రాజకీయాలకు అతీతంగా కృషి చేసి సగరుల అభ్యున్నతికి సభ్యులు తోడ్పడాలని కోరారు. అధ్యక్షుడిగా బోయిని బాలాజీ, సెక్రెటరీగా చిలకల బాలరాజు, ట్రెజరీగా గౌరుకంటి శివ, గౌరవ అధ్యక్షులుగా టివై శివ తదితరులను ఎనున్నకున్నారు.

రైలు నుంచి కిందపడి యువకుడికి గాయాలు

మహానంది: రైలులో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడటంతో ఓ యువకుడు ప్రాణాలతో బయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా తర్లపాడు మండలం గానుగపెంటకు చెందిన అశోక్ కాచిగూడ- గుంటూరు రైలులో వెళ్తుండగా గాజులపల్లె స్టేషన్, చలమ మధ్యలో ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాజులపల్లె రైల్వేస్టేషన్ మేనేజర్, సిబ్బంది వెంటనే 108కు సమాచారం అందించారు. దీంతో సిబ్బంది రమణ, రంగన్నలు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అతని పరిస్థితి మెరుగ్గానే ఉందని వారు చెప్పారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఏఎస్ఐ అబ్దుల్‌నబి

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో వెలసిన హజ్రత్ దస్తగిరి స్వాముల ఉరుసు ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన ఎద్దుల బండ లాగుడు పోటీలను ఏఎస్ఐ అబ్దుల్‌నబి ప్రారంభించారు. పోటీల్లో వైఎస్సార్, నంద్యాల జిల్లాల నుంచి సుమారు 17 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ప్రొద్దుటూరు పట్టణంలోని మోడంపల్లికి చెందిన శ్రీజారెడ్డి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచి రూ.25వేలు గెలుపొందగా, ద్వితీయ స్థానంలో నిలిచిన నాగయపల్లికి చెందిన ఆదిత్య యాదవ్ వృషభాలకు రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కటికపల్లికి చెందిన మూలే విఘ్నేశ్వరరెడ్డి వృషభాలకు 14 తులాల వెండి కడియం, నాలుగో స్థానంలో నిలిచిన నాగాయపల్లె వేమారెడ్డికి చెందిన వృషభాలకు రూ.10,016, ఐదవ స్థానంలో నిలిచిన ఈశ్వరరెడ్డి నగర్‌కు చెందిన బాలయ్య వృషభాలకు రూ.6116, ఆరవ స్థానంలో నిలిచిన తిమ్మయ్య కాలనీకి చెందిన తేజేశ్వరరెడ్డి వృషభాలకు రూ.5116 నగదును కమిటీ సభ్యులు, దాతలు అందజేశారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. స్థానికులు నాయకులు ఉన్నారు. సర్పంచ్ బంగారు షరీఫ్, గోవిందయ్య, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, జెడ్పీటీసీ లక్ష్మీదేవి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లయ్య, నవీన్, ప్రసాద్, గ్రామ నాయకులు జబ్బార్, గౌస్‌పీర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం





ఆరోగ్యమాత ఆలయంలో బోధిస్తున్న ఫాదర్ ప్రసన్నకుమార్, హాజరైన క్రైస్తవులు



ఉయ్యాలవాడలో మట్టలతో ప్రదక్షిణ చేస్తున్న క్రైస్తవులు



క్రిష్టిపాడులో మట్టలు చేతపట్టుకొని చర్చి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న క్రైస్తవులు

నంద్యాల(న్యూటౌన్): ప్రతి ఒక్కరూ శాంతి, సమాధానాన్ని పంచుతూ క్రీస్తు బాటలో నడవాలని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ప్రసన్నకుమార్, హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1 డీనరీ చైర్మన్ జోసెఫ్, ఇమ్మానియేల్, నందం ఐజక్ అన్నారు. మట్టల ఆదివారం సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని అన్ని క్రైస్తవ సంఘాల్లో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. మట్టలు చేతపట్టుకొని ప్రత్యేక పాటలు పాడుతూ ఆలయాల చుట్టూ ప్రత్యేక ప్రదక్షిణలు చేశారు. పాస్టర్లు విజయ్‌కుమార్, జోయెల్, డానియేల్‌పురం పాస్టరేట్ విక్టర్‌బాబు, టెక్కె పాస్టరేట్ చైర్మన్ సుమిత్రబాబు తదితరులు క్రైస్తవులకు దేవుని సందేశం వినిపించారు.

ఉయ్యాలవాడ : మండలంలో గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈస్టర్ పండుగకు ముందస్తుగా క్రైస్తవులు ఉపవాస దీక్షలతో మూడు వారాలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం మట్టలతో పురవీధుల్లో ప్రదర్శనలు చేశారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు.

దొర్నిపాడు: మండలంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూకొత్తపల్లె, గుండుపాపల, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల గ్రామాల్లో ఉదయమే చర్చీలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు క్రీస్తు మరణానికి ముందు యెరుషలేములో సందర్శించేందుకు గాడిదపై వెళ్తుండగా ప్రజలంతా జయోత్సాహంతో నేలపై తమ వస్త్రాలను పరిచి కర్జూరపు మట్టలు చేతబూని క్రీస్తుకు స్వాగతం పలికారని, ఏటా ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా క్రైస్తవులు జరుపుకోవడం ఆనవాయితీ.

వాహనాలపై స్టిక్కర్లకు అనుమతులు తప్పనిసరి



బొల్లవరంలో మాట్లాడుతున్న డీటీ కామేశ్వరరెడ్డి

మహానంది: వివిధ రకాల వాహనాలకు యజమానులు అతికించుకునే రాజకీయ పార్టీల స్టిక్కర్లు, జెండాలకు అనుమతి తప్పనిసరిగా ఉండాలని ఫ్లయింగ్ స్క్వాడ్ డీటీ బి.కామేశ్వరరెడ్డి తెలిపారు. బొల్లవరం, పలు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి ఉంటేనే జెండాలు, స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేగంగా గోడౌన్ నిర్మాణ పనులు



కొండాపురంలో నిర్మిస్తున్న గోదాము

దొర్నిపాడు: కొండాపురం గ్రామంలో నిర్మిస్తు న్న బహుళ ప్రయోజన గోదాము నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. రూ.40 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కల్గిన గోదాం రైతులకు ఎంతో ఉపయోగంగా మారనుంది. గ్రామం కేసీ కెనాల్ సమీపంలో ఉండటంతో వరి పంటను అధికంగా సాగు చేస్తారు. దీంతో రైతులు ప్రైవేటు గోదాముల్లో ధాన్యం దాచుకోవడానికి ఇబ్బందులు పడేవారు. గ్రామంలోని గోదాం నిర్మిస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.